క్లుప్తంగా

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న నోముల ప్రకాశ్‌రావు


నోముల ప్రకాశ్‌రావు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు ఈనెల 14న కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. సీతాఫల్‌మండీ డివిజన్ నామాలగుండు బీఎస్ఆర్ గార్డెన్ నుంచి గాంధీ భవన్ వరకు వెయ్యి మందితో ర్యాలీగా వెళ్లి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన మంగళవారం ప్రకటించారు. తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన తనకు పార్టీ నాయకులు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చని కారణంతో బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పలువురు మిత్రులు, అనుచరుల సూచన మేరకు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, సికిందాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకుడు గౌరీశంకర్ నేతృత్వంలో రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్

లాలాపేట: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సికింద్రాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నాయకులు సమన్వయంతో పని చేయాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనీల్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం టీపీసీసీ కార్యదర్శి జీడి అమర్‌నాథ్ గౌడ్ తన జన్మదిన వేడుకలను లాలాపేటలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలందరూ ఆదరించాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంతోష్, సందీప్‌రాజు, జగదీశ్వర్, కిషోర్‌యాదవ్, బ్రహ్మాజీ, స్థానిక బీఆర్ఎస్ నాయకులు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగేశ్వర్ రావుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బిజేపి నాయకులు వెంకటేష్‌గౌడ్, పోచయ్య, ఆర్ఎస్ఎస్ శ్రీనివాస్, అనీల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రవిప్రసాద్‌గౌడ్



బౌద్ధనగర్: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బౌద్ధనగర్‌కు చెందిన రవి ప్రసాద్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవిప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, శ్యాంసుందర్‌గౌడ్, వెంకట రమణిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవితో తనకు బాధ్యత పెరిగిందని, పార్టీ అభివృద్ధి కోసం, రాబోయే ఎన్నికల్లో విజయ ఢంకా మోగించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

యువకుడి ఆత్మహత్య

బౌద్ధనగర్: ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షాబాద్‌గూడ శ్రీనివాసనగర్‌కు చెందినఎండీ ఇజాజ్ అలియాస్ ఇమ్రాన్ (25) ఫ్లవర్ డెకొరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 12న సాయంత్రం ఇంటికి వచ్చిన అతను గదిలోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన అతడి సోదరి స్థానికుల సహాయంతో కిందకు దించి సమీపంలోని ఆస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి

కట్టుదిట్టమైన ఏర్పాట్లు


మంత్రి తలసానికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అధికారులు, పాలక మండలి సభ్యులు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు మంగళవారం ఉదయం మంత్రికి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయన చేతుల మీదుగా కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

- ఎండలు మండుతున్న నేపథ్యంలో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల కోసం తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బీజేజేఆర్‌నగర్ రోడ్డు వైపు, 60 ఫీట్ రోడ్డు వరకు తాత్కాలిక షెడ్లు వేయించాలని ఆదేశించారు.

దేవాదాయశాఖ మంత్రికి ఆహ్వానం

- దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సాయిబాబా,
- అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, హనుమంత్‌రావు, కట్ట బలరాం, కూతురు నర్సింహ, శ్రీనివాస్‌గుప్తా, రోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రిని సత్కరిస్తున్న బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీ వాసులు

మంత్రికి ముస్లిం నేతల సన్మానం

సనత్‌నగర్: ఎందరో నాయకులు, గత ప్రభుత్వాలకు విన్నవించుకున్నా పరిష్కారం కాని తమ 50 ఏళ్ల సమస్యను పరిష్కరించారని బేగంపేటకు చెందిన ముస్లింలు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బేగంపేట ప్రాంతంలో ముస్లింలు అంత్యక్రియలు నిర్వహించేందుకు సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో సమస్యను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో చర్చించిన ఆయన బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ప్రాంతంలో రెండెకరాల భూమిని ముస్లిం కబరస్థాన్‌కు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి ఆధ్వర్యంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసం వద్దకు బాణాసంచా కాల్చారు. మంత్రిని కలిసిన వారిలో మైనార్టీ నాయకులు సలీం ఖాన్, సాబేర్, అకిల్, సమి, మోహన్, వాహీద్, ఆరీఫ్, ఫిరోజ్, బీఆర్ఎస్ నాయకులు నరేందర్ రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ప్రాణదాతకు సత్కారం


ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ చిన్నబాబు

సికింద్రాబాద్: కదులుతున్న రైలు ఎక్కబోయి కింద పడిన ప్రయాణికుడిని ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ప్రాణాలకు తెగించి కాపాడిన సంఘటన ఈనెల 12న హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. తన ప్రాణాలను లెక్కచేయకుండా ప్రయాణికుడిని కాపాడిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌ను మంగళవారం సికింద్రాబాద్ డివిజనల్ ఆర్‌పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబశ్మిత బెనర్జీ అభినందించారు. బోరబండకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ అనే వ్యక్తి హైదరాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతున్న ఎంఎంటీఎస్ రైలును ఎక్కేందుకు ప్రయత్నించాడు. అప్పటికే రైలు వేగం పెరగడంతో అతను జారి కిందపడిపోయాడు. ప్లాట్‌ఫామ్, రైలు బోగీకి మధ్యలో పడిపోతున్న ఇస్మాయిల్‌ను అదే రైలులో గార్డుగా విధులు నిర్వహిస్తున్న కే.చిన్నబాబు అనే ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ గుర్తించాడు. వెంటనే బోగీ నుంచి ప్లాట్‌ఫామ్ మీదకు దూకిన అతను ఇస్మాయిల్‌ను బయటికి లాగి ప్రాణాలు కాపాడాడు. కానిస్టేబుల్ తెగువను గుర్తించిన చీఫ్‌సెక్యూరిటీ ఆఫీసర్ ప్రత్యేకంగా అభినందించారు. అతడికి శాఖాపరమైన ప్రోత్సాహకాన్ని అందిస్తామని ప్రకటించారు.

ఆర్థిక సాయం అందజేత


విద్యార్థులతో రాయల సేవా సమితి ప్రతినిధులు

అమీర్‌పేట: రాయల సేవా సమితి, మాత అరవింద మహిళా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అమీర్‌పేట ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. 10వ తరగతి పరీక్షల్లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు సాయం అందించడంతో పాటు అకడమిక్ ఎక్సలెన్స్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు మధు, ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్, సంస్థ ప్రతినిధులు అమరేశ్వరి, విజయ శ్రీ,నాగరేఖ, హేమలత, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

రసూల్‌పురా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కంటోన్మెంట్ రెండో వార్డు రసూల్‌పురాలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శానిటరీ విభాగం సర్కిల్ కార్యాలయంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులను బీఆర్ఎస్ నాయకులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శానిటరీ విభాగం దఫేదార్లు సూరి, మహేష్ వార్డు బీఆర్ఎస్ నాయకులు శ్యాంరెడ్డి, వాహబ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రొ.అన్సారీ దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ప్రొ.అన్సారీ దీక్ష రెండో రోజు కొనసాగింది. మంగళవారం ప్రొ.అన్సారీగా మద్దతుగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా ల్యాప్‌టాప్ విషయమై అడుగుతున్నారని ప్రొ.అన్సారీ ఈ సందర్భంగా పే ర్కొన్నారు. చిన్న అంశాన్ని సాకుగా చూపి ప్రిన్సిపాల్ ప్రొ.గణేష్ నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. వీసీ ప్రొ.రవీందర్ తన పై కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే నోడ్యూస్ సర్టిఫికెట్ ఇప్పించి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతానని హెచ్చరించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఏడుగురి అదృశ్యం

సాక్షినెట్‌వర్క్: వేర్వేరు ప్రాంతాల్లో ఒకే రోజు ఏడుగురు అదృశ్యమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి..


బేబమ్మ, చిన్నారులు (ఫైల్)

చిలకలగూడ : ఇద్దరు చిన్నారులతో సహా తల్లి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఆంజనేయులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సనత్‌నగర్ బల్కంపేట ఆలయ ప్రాంతానికి చెందిన బేబమ్మ, వెంకటేష్ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె వరలక్ష్మీ ఉన్నారు. ఈనెల 5న ఇద్దరు పిల్లలతో సహా బేబమ్మ చిలకలగూడ శ్రీనివాసనగర్‌లో ఉంటున్న అక్క రాధ ఇంటికి వచ్చింది. 7వ తేదీ రాత్రి అందరూ నిద్రిస్తుండగా ఇద్దరు పిల్లలను తీసుకుని బయటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

భార్యతో గొడవపడి..


అబ్దుల్ జోసఫ్(ఫైల్)

బౌద్ధనగర్: భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాప్టిస్ట్ చర్చి రాంనగర్ ప్రాంతంలో జలాది సంగీత, అబ్దుల్ జోసఫ్ హిరామ్స్ షేక్ (45) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 12 భార్యభర్త ల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికిలోనైన అబ్దుల్ జోసఫ్ హిరామ్స్ షేక్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. అతను తిరిగి రాకపోవడంతో అతడి భార్య సంగీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వారాసీగూడలో వృద్ధుడు..


రామయ్య (ఫైల్)

బౌద్ధనగర్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది.ఎస్సై సుధాకర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి ... పార్శీగుట్ట, అశోక్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి రామయ్య (80) ఈ నెల 12న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ప్రయోజనం కనిపించలేదు. దీంతో అతడి కుమార్తె జయమ్మ మంగళవారం సాయంత్రం వారాసీగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్రైం కార్నర్

పదోతరగతి విద్యార్థిని


జ్యోత్స్న (ఫైల్)

సనత్‌నగర్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్ఐ జయచందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బేగంపేట మయూరీ మార్గ్ అల్లంతోటబావికి చెందిన బర్ల సుహాసిని కుమార్తె జోత్స్న(15) పదో తరగతి చదువుతోంది. ఈ నెల 10న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన జోత్స్న తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి సుహాసిని బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బ్రాహ్మణ వాడీలో మరో బాలిక..


రమావత్ దీపిక (ఫైల్)

బేగంపేట బ్రాహ్మణవాడీకి చెందిన రమావత్ హరియానాయక్ చిన్న కుమార్తె రమావత్ దీపిక (14) అమీర్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సోమవారం రాత్రి అందరితో పాటు నిద్రకు ఉపక్రమించింది. మంగళవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు నిద్ర లేచి చూడగా దీపిక కనిపించలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రూ. 90 వేల నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం

అడ్డగుట్ట: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెస్ట్‌మారేడుపల్లి ప్రాంతానికి చెందిన 13 మంది వ్యక్తులు సోమవారం రాత్రి ఈస్ట్ మారేడుపల్లి టీచర్స్ కాలనీలోని ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం అందడంతో తుకారాంగేట్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 90 వేల నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో నకిలీ డాక్టర్ ?

రాంగోపాల్‌పేట్: నిమ్స్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నట్లు చెప్పుకుంటూ రోగం నయం చేస్తానని ఓ మహిళను లాడ్జికి తీసుకుని వెళ్లి 10 గ్రాముల బంగారు గొలుసు, రూ.5వేల నగదుతో ఉడాయించిన ఓ నకిలీ డాక్టర్‌ను గోపాలపురం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విశ్వసనీయ కథనం మేరకు కూకట్‌పల్లికి చెందిన ఓ మహిళ (50) ఈ నెల 2న తన స్వగ్రామం వెళ్లేందుకు సికింద్రాబాద్‌లో రైలు ఎక్కింది. పక్క సీటులో కూర్చున్న వ్యక్తి తాను నిమ్స్ ఆస్పత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నట్లు చెప్పుకుని పరిచయం చేసుకున్నాడు. దీంతో సదరు మహిళ తన ఆరోగ్య సమస్యలను అతడితో చెప్పుకుంది. ఇరువురు ఫోన్ నంబర్లు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ నెల 7న ఆమె సికింద్రాబాద్‌కు తిరిగి వచ్చింది. అతే సమయంలో బాధితురాలికి ఫోన్ చేసిన నకిలీ వైద్యుడు ఆమె అనారోగ్యానికి మందులు తెచ్చినట్లు చెప్పాడు.

అనంతరం ఆమెను రెజిమెంటల్‌బజార్‌లోని ఓ లాడ్జీకి తీసుకెళ్లి మత్తు మందు ఇచ్చి నగదు, బంగారు నగలతో ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడిని నెల్లూరు జిల్లాకు చెందిన వెంకటేష్‌గా గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


సంపత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లాలాపేట: అంకితభావంతో బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తార్నాకకు చెందిన బీజేపీ రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ కొన్నె సంపత్ తల్లి రాజమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో మంగళవారం తార్నాకలోని సంపత్ ఇంటికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొన్నె రాజమ్మ చిత్రపటం వద్ద నివాళుల ర్పించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న శాంతినగర్‌కు చెందిన బీజేపీ నాయకులు సుధాకర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, వీరన్న, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తితోనే విజయ డెయిరీ అభివృద్ధి


మాట్లాడుతున్న చైర్మన్ సోమ భరత్‌కుమార్

లాలాపేట: విజయ డెయిరీలో మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళా సంక్షేమ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డెయిరీ చైర్మన్ సోమ భరత్‌కుమార్ మాట్లాడుతూ విజయ డెయిరీలో 40 శాతానికి పైగా మహిళలు పని చేయడం సంతోషంగా ఉందని, వారి కృషితోనే సంస్థ నానాటికి అభివృద్ధి చెందుతుందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మహిళల భద్రతకు షీ టీమ్స్ ఏర్పాటు చేశారని, డబుల్ బెడ్‌రూం, కల్యాణ లక్ష్మీ పథకాలను మహిళలనే లబ్ధిదారులుగా గుర్తిస్తూ వారికి పెద్ద పీట వేశారని కొనియాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డెయిరీ) దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలో మెగా డెయిరీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. విజయ పాడి ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల విజయ పార్లర్లు, స్టాల్స్‌ను విస్తరిస్తున్నామన్నారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ముద్ర లోన్స్ ద్వారా పశువులను కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ ఆవరణలో మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. వైద్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు రీటా అగర్వాల్, విజయ డెయిరీ మెనేజర్లు కామేష్, మల్లయ్య, మల్లికార్జున్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారం ఎనలేనిది

మంత్రి తలసానికి బత్తిన కుటుంబసభ్యుల కృతజ్ఞతలు


మంత్రి తలసానిని సన్మానించిన బత్తిన కుటుంబసభ్యులు

సనత్‌నగర్: ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలతోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేప ప్రసాదం పంపిణీ చేయగలిగామని బత్తిన హరినాథ్‌గౌడ్ కుటుంబ సభ్యులు అన్నారు. ఈ మేరకు మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన బత్తిన కుటుంబసభ్యులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు రూ.5 లక్షల మందికి చేప ప్రసాదం పంపిణీ చేసినట్లు మంత్రికి వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని మంత్రి గుర్తుచేశారు. ఏర్పాట్లపై అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి పర్యవేక్షించిన మంత్రి శ్రీనివాస్‌యాదవ్, తమకు అన్నివిధాల సహకరించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బత్తిన అమర్నాథ్ గౌడ్, సంతోష్, శివశంకర్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికే ఇ- శ్రామ్ కార్డులు



రసూల్‌పురా:అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి ఇ–శ్రామ్ గుర్తింపు కార్డులు దోహదడతాయని సర్కిల్ 36వ కార్మికశాఖ అధికారి ముత్రక్ భరత్ అన్నారు. మంగళవారం మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో ప్రజా చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మిక విభాగం అధికారులు సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సామాజిక భద్రత కోసం భారత ప్రభుత్వం ఇ–శ్రామ్ యోజనను ప్రారంభించిందని ఈ కార్డుదారులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ. 2 లక్షల బీమా కవరేజీ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇ–శ్రామ్ పోర్టల్‌లో తమ పేర్లు, వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్మికులకు 60 ఏళ్ల తర్వాత పెన్షన్, మరణ బీమా, ఆర్థిక సహాయం తదితర ప్రయోజనాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో కార్మిక విభాగం సర్కిల్ 16 అధికారి గిరిరాజ్, ప్రజా చైతన్య యూత్ అసోసియేషన్ సభ్యులు వెంకటరాములు, గురవయ్య. అంజి, రాజు, అనిత, యాదమ్మ. లలిత, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ జన్మదిన వేడుకలు


శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

కంటోన్మెంట్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలతో పాటు వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ రామకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.